క్లుప్తంగా

పనులు వేగవంతం

బ్రహ్మంగారిమఠం: మండలంలోని తోట్లపల్లె వద్ద రూ.20 కోట్లతో చేపట్టిన గురుకుల పాఠశాల పనులు వేగంగా జరుగుతున్నాయి. బద్వేల్ ఆర్డీఓ చంద్రమోహన్, పీఆర్ డీఈఈ మధు, విద్యుత్ ఏఈఈ శంకర్, డిప్యూటీ తహసీల్దార్ జాన్స్, ఎంపీడీఓ పరిపాలనాధికారి మల్లికార్జున మంగళవారం పనులను పరిశీలించారు. రెండు రోజుల్లో పూర్తి స్థాయి అందుబాటులోకి వస్తుందని ఆర్డీఓ తెలిపారు. పాఠశాలలో మౌలిక వసతుల నిర్మాణం పూర్తిచేసి ఈ నెలాఖరుకు విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నుపల్లె సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మైదుకూరు: మాదక ద్రవ్యాలపై యువత అప్రమత్తంగా ఉండాలని ఎక్సైజ్ ఎస్ఐ జి.భారతి అన్నారు. మాదక ద్రవ్యాల నిరోధక వారోత్సవాల సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఎస్ఐ భారతి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో యువత జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తు ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. అయ్యవారిరెడ్డి, పీవీ.కృష్ణారెడ్డి, నరసింహారావు, చిన్నరాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బి.మఠంలో సర్వే

బ్రహ్మంగారిమఠం: ప్రముఖ క్షేత్రం బ్రహ్మంగారిమఠంలో సెంట్రల్ లైటింగ్, డ్రైనేజీల ఏర్పాటుకు పంచాయతీరాజ్ అధికారులు మంగళవారం సర్వే నిర్వహించారు. బి.మఠం అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభిస్తామని డీఈఈ మధు తెలిపారు.

నేడు మండల సమావేశం

బ్రహ్మంగారిమఠం: బి.మఠం మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం పది గంటలకు ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి అధ్యక్షతన జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ వీరకిషోర్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎం.రామగోవిందరెడ్డి సమావేశానికి హాజరవుతారని, అధికారులు ప్రణాళికలతో రావాలని సూచించారు.

వీఆర్‌ఏ మృతికి సంతాపం

అట్లూరు: మండలంలోని కమలకూరు రెవెన్యూ సహాయకుడిగా పని చేస్తుండే దారం పెద్ద గురవయ్య (53) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఏపీ వీఆర్‌ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లిపోగు నాగేశం గురవయ్య మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ నాయకులు బాష, గురుస్వామి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

మైదుకూరు: మైదుకూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన ఎస్.చంద్రలేఖ, టి.ఫర్హానా ఇడుపులపాయ ఆర్‌కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో ప్రవేశం సాధించారు. ఈ సందర్భంగా గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు కె.రాధానరసింహారాజు విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.5 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు గంగాభవాని, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

పదోన్నతులపై స్పష్టత ఇవ్వాలి

ప్రొద్దుటూరు రూరల్: సచివాలయ ఉద్యోగుల పదోన్నతులు, రేషనలైజేషన్‌పై స్పష్టత ఇచ్చిన తర్వాతే బదిలీలు చేపట్టాలని ఏపీఎన్జీఓ ప్రొద్దుటూరు తాలూకా అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి డిమాండ్ చేశారు. మండల సచివాలయ ఉద్యోగులతో కలిసి ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులను ఇతర మండలాలకు బదిలీ చేస్తే అరకొర వేతనాలతో ఇబ్బందులకు గురవుతారన్నారు. ప్రభంజన్ రెడ్డి, నాగార్జున, కిరణ్, సింధూరి పాల్గొన్నారు.

సీపీఐ కార్యదర్శిగా రవికుమార్

పోరుమామిళ్ల: సీపీఐ మండల కార్యదర్శిగా రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన నూతన కమిటీ ఎంపికలో సహాయ కార్యదర్శులుగా కేశవ, ఫిరోజ్ ఎన్నికయ్యారు. వారితో పాటు మరో 22 మందితో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు.

అతిసార వ్యాధిపై అవగాహన

బి.కోడూరు: అతిసార వ్యాధిపై జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి వినీత్‌కుమార్ రాజు కోరారు. అతిసార వ్యాధిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు కలుషితమై డయేరియా (వాంతులు, విరేచనాలు) వచ్చే అవకాశం ఉందన్నారు. 5 సంవత్సరాల పిల్లలందరికీ జింక్ మాత్రలు మింగించాలని, ఓఆర్‌ఎస్ ద్రావణం తాపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జాన్ విలియం, ఎంఎల్‌హెచ్‌పి దేవిక, ఆయేష పాల్గొన్నారు.

కుంటుపడుతున్న బోధన

పోరుమామిళ్ల: ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలతో విద్యా బోధన సజావుగా సాగడం లేదని ఎస్టీయు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి అన్నారు. స్థానిక ఎస్టీయూ భవన్‌లో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ డీఎస్సీ ద్వారా 250 పోస్టులు భర్తీ చేసినా 450 పోస్టులు మిగిలిపోతాయన్నారు. ప్రస్తుత డీఎస్సీలో అన్ని ఖాళీ పోస్టులు భర్తీ చేయాలన్నారు. పదోన్నతులు పొందిన వారికి వేతనాలు చెల్లించాలన్నారు.

జాతీయ రహదారిలో.. మృత్యు ఘోష

ఖాజీపేట పరిధిలోని జాతీయ రహదారిపై మృత్యు ఘోష వినిపిస్తోంది. బైక్‌పై రోడ్డు దాటుతూ మృత్యు బారిన పడేవారి సంఖ్య పెరుగుతోంది. అప్రోచ్ రోడ్డు నిర్మాణం జరగక రోడ్డుపై చేరుతూ జనం ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని సమీప గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- 40 రోడ్డు ప్రమాదాల్లో 17 మంది మృతి
- నిబంధనలు పాటించకుండా టోల్ వసూలు
- ప్రమాదాలు జరిగినా అధికారుల స్పందన కరవు



నాగపట్నం వద్ద జాతీయ రహదారి

ఖాజీపేట: మండలంలోని చెన్నూరు గ్రామం వద్ద పెన్నానది వంతెన నుంచి మైదుకూరు సమీపం లోని కుమ్మకొట్టాల వరకూ 20 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరించింది. ఈ రహదారికి అనుసంధానంగా అప్రోచ్ రోడ్డు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికంగా బైక్‌పై రోడ్డు దాగుతున్నవారే అధికంగా మృత్యువారిన పడగా, కొందరు క్షతగాత్రులు అవుతున్నారు. ఇంత జరుగుతున్నా జాతీయ రహదారి నిర్మాణ సంస్థ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం లేదు.

ప్రమాదాల్లో 35 మంది క్షతగాత్రులు

ఖాజీపేట మండల పరిధిలో జాతీయ రహదారి దాటుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో సుమారు 17 మంది మృతిచెందగా, 35 మంది క్షతగాత్రులయ్యారు. నిబంధనల ప్రకారం గ్రామాలకు వెళ్లేందుకు అప్రోజ్ రోడ్డు లేక అండర్ గ్రౌండ్ రహదారి నిర్మించాలి. నిర్మాణ సంస్థ ఎలాంటి పనులు చేయలేదు. భూమాయపల్లె, ముత్తులూరుపాడు, మూలవారిపల్లె, శాంతి నగరం గ్రామాలతోపాటు చాపాడుకు వెళ్లే ప్రధాన రహదారిపై అప్రోజ్ రోడ్డు లేదు. జాతీయ రహదారి దాటి నాగపట్నం గ్రామానికి పత్తూరు నుంచి వెళ్లాల్సి వసోతంది. కూనవారిపల్లె గ్రామస్థులదీ ఇదే పరిస్థితి. చెమ్ముళ్లపల్లె, చెన్నముక్కపల్లె, సి.కొత్తపల్లె గ్రామాలకు వెళ్లే వారికి కనీసం అప్రోజ్ రోడ్డులేదు. అండర్ గ్రౌండ్ రహదారి లేదు. బైక్ లేదా కాలినడకన జాతీయ రహదారి దాటాల్సి వస్తోంది. ఖాజీపేటకు నిత్యం వందలాది వాహనాలు వస్తున్నా కడప వైపు నుంచి మైదుకూరు వైపునకు వెళ్లేందుకు అప్రోచ్ రోడ్డు లేదు. రోజూ వాహనాలు రోడ్డు దాటి వెళ్లడం గండంగా మారుతోంది. ఈ దారిలోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. అన్ని సదుపాయాలు కల్పించిన తరువాతనే టోల్ వసూలు చేయాలనే నిబంధనను అధికారులు పట్టించుకోవడంలేదు.

ఖాజీపేట ప్రధాన కూడలి వద్ద లైటింగ్, సీసీ కెమెరాలు లేకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రోడ్డు దాటేందుకు వాహనదారుల అవస్థ

జనవరి 2024 నుంచి నేటి వరకు జరిగిన ప్రమాదాలివీ..

తేదీ	ప్రమాద స్థలం	మృతులు
2024 జనవరి, 13న	కూనవారిపల్లె క్రాస్ వద్ద	చింతల చెరువు గంగాదేవి(47)
ఫిబ్రవరి 5న	బుడ్డాయపల్లె క్రాస్ వద్ద	గుర్తు తెలియన వ్యక్తి మృతి
మార్చి 9న	సి.కొత్తపల్లె క్రాస్ వద్ద	రేవనూరు నాగయ్య (77)
ఏప్రిల్ 14న	ఆంజనేయపురం వద్ద	మేదా రవీంద్ర(55)
ఆగస్టు 31న	పాటిమీదపల్లె వద్ద	దినేష్(19), రమణయ్య(24)
సెప్టెంబరు 27న	కూనవారిపల్లె క్రాస్ వద్ద	వెంకటసుబ్బయ్య(67)
అక్టోబరు 19న	చెన్నముక్కెపల్లె వద్ద	గుర్తు తెలియని వ్యక్తి మృతి
2025 ఫిబ్రవరి,13న	భూమాయపల్లె వద్ద	జి.అరుణ(51)
ఫిబ్రవి 20న	కుమ్మరకొట్టాలు వద్ద	నరహరినాయుడు(36)
మార్చి 27న	యశ్వంత్ వే బ్రిడ్జి	దూదేకులబాబుసాబ్(47)
మార్చి 30న	బుడ్డాయపల్లె క్రాస్ వద్ద	సి.చక్రవర్తి(29)
మే 19న	భూమాయపల్లె క్రాస్ వద్ద	ఇల్లూరిరామలక్ష్మమ్మ(57)
మే 31న	నందిపాడు కాలనీ క్రాస్ వద్ద	జి.లక్ష్మీప్రసన్న(36)
జూన్ 01న	నాగపట్నం క్రాస్ వద్ద	డి.భాస్కర్(34)
జూన్ 6న	రావులపల్లె క్రాస్ వద్ద	పి.బాలస్వామి(47)
జూన్ 20న	నాగపట్నం క్రాస్ వద్ద	కె.మల్లమ్మ (55)

అప్రోచ్ రోడ్డు లేదు

ఖాజీపేట మండల పరిధిలో జాతీయ రహదారి నుంచి గ్రామాలకు వెళ్లేందుకు అప్రోచ్ రోడ్డు లేదు. నిర్మాణ సంస్థ దృష్టికి తీసుకెళ్లాం. ఎస్పీ స్పందించి ప్రమాదాల నివారణకు సూచనలు చేశారు. నేషనల్ హైవే అధికారులు కూడా జాగ్రత్తలు చేపడతామని, సూచికలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

– మోహన్, సీఐ, ఖాజీపేట

రోడ్డు నిర్మాణ సంస్థ నిర్లక్ష్యం

జాతీయ రహదారి నిర్మాణ సంస్థ నిర్లక్ష్యంతో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. అప్రోచ్ రోడ్డు లేక అండర్ గ్రౌండ్ రహదారి లేకపోవడంతో బైక్‌పై దాగుతూ జనం ప్రమాదాల బారిన పడుతున్నారు. అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలి.

నాగసుబ్బారెడ్డి, డ్రైవర్, భూమాయపల్లె

అన్నదాత సుఖీభవ పథకంపై స్పష్టత అవసరం

మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య

చాపాడు: ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడచినా అన్నదాతన సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయంపై స్పష్టత ఇవ్వలేదని, రోజుకో నిబంధన పెడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పట్టా భూములు కలిగిన రైతులకు మాత్రమే అన్నదాత సుఖీభవ పడుతుందని, ఇనాం, చుక్కలు, డీకేటీ, బంజరు, పొరంబోకు భూములకు పెట్టుబడి సాయం అందదని సోషల్ మీడియా ద్వారా తెలిసి రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో భూమి కలిగిన ప్రతి రైతుకు పెట్టుబడి సాయం వచ్చేదన్నారు. తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవడంపై క్లారిటీ ఇవ్వాలని తెలిపారు. ఏఓ దేవి పద్మలత మాట్లాడుతూ ఉన్నతాధికారుల నుంచే రైతుల ఎంపిక జరుగుతుందని, తామేమీ చేసేది లేదన్నారు. ఈకేవైసీ చేయించుకోవాల్సిన అవసరం లేదని రైతులకు తెలియజేస్తామన్నారు. మండలంలో విద్యుత్తు సమస్యలను పరిష్కరించాలని, వేలాడే తీగలను సరిచేయాలని, ఒరిగిన స్తంభాలకు మరమ్మతులు చేపట్టాలని, బ్రేక్‌డౌన్‌లు లేకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఇన్‌ఛార్జి ఏఈ రామభద్రయ్యకు ఎంపీపీ సూచించారు. సిద్దారెడ్డిపల్లె, చియ్యపాడు గ్రామాల్లోని ఎంపీపీ స్కూల్‌లు మూత పడకుండా అక్కడి గ్రామస్థుల కోరిక మేరకు కొనసాగించాలని ఎంఈఓ రవిశంకర్‌ను కోరారు. అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం మీదుగా ఆర్టీసీ బస్సులు నడపాలని చెప్పారు. మందుల కొరత లేకుండా ప్రజలకు వైద్య సేవలందించాలని వైద్య సిబ్బందికి తెలియజేశారు. ఇదే క్రమంలో పలువురు సర్పంచులు తమ గ్రామాల్లో సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప ఎంపీపీ శుభకరుణమ్మ, తహసీల్దారు రమాకుమారి, ఎంపీడీఓ వీరకిషోర్, వైద్యాధికారులు శివప్రసాద్‌రెడ్డి, శ్రీవాణి, కావ్యమాధురి, ఏపీఎం శ్రీధర్, సీడీపీఓ సయ్యద్ ముంతాజ్‌బేగం, పశు వైద్యాధికారి మహమ్మద్‌గౌస్, పీఆర్ ఏఈ చలపతి, హౌసింగ్ ఏఈ ప్రమోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ లక్షుమయ్య

బ్రహ్మంగారిమఠం అభివృద్ధికి కట్టుబడి ఉంటాం

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంగారిమఠం అభివృద్ధి వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉంటుందని బి.మఠం వైఎస్సార్‌సీపీ నాయకులు కొండాశింగరయ్య, దేవస్థానం మాజీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పసులేటి రామయ్య తెలిపారు. విలేకరులతో మంగళవారం వారు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి సహకారంతో ఎంపీపీ, జెడ్పీటీసీలు మఠం అభివృద్ధిని పరుగులు తీయించారన్నారు. అందరి సహకారంతో రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మఠం పరిపాలనాధికారి శంకర్‌బాలాజీ దేవస్థానం పరిధిలో కొత్త వ్యాపార సముదాయాలు నిర్మించడం మంచిదే అన్నారు. అయితే ఐదు రోడ్ల కూడలి నుంచి దేవస్థానం వైపునకు 26 మంది వ్యాపార సముదాయాలు తొలగించి 15 రోజులు గడచినా.. ఇప్పటివరకూ ఎలాంటి నిర్మాణాలు కార్యరూపం దాల్చలేదన్నారు. వ్యాపారులకు నష్టం కలగకుండా చూడాల్సిన బాధ్యత దేవస్థానం నిర్వాహకులపై ఉందని సూచించారు. పురాతన సత్రాలు తొలగించి భక్తులకు సౌకర్యంగా మరిన్ని గదులు నిర్మించాల్సి ఉన్నా.. వాటి జోలికి ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. వ్యాపార సముదాయాలు తొలగించి బస్ షెల్టర్ నిర్మించాలని కోరారు.



తొలగించకుండా వదిలేసిన అంగళ్లు

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలి

బద్వేలు అర్బన్: కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు కె.నాగేంద్రబాబు పేర్కొన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని జూలై 9న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డికి సమ్మె నోటీసు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు ఏళ్లుగా పోరాడి సాధించుకున్న 29 రకాల చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుదించి నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్పు చేసిందని ఆరోపించారు. ఉద్యోగ భద్రత లేకుండాపోవడంతోపాటు కార్మికులు బానిసలుగా మారే అవకాశం ఉందన్నారు. ఇలాంటి ప్రమాదకర లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఆప్కాస్ సంస్థను రద్దు చేసి కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్యాంప్రవీణ్, హరి, శ్రీనివాసులు, దేవమ్మ, ప్రవీణ్‌కుమార్, బాలయ్య, శివకుమార్, చంద్రశేఖర్ రామయ్య, చంద్ర, రాంమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న నాయకులు

పేదల ఇళ్లను తొలగించొద్దు

ప్రొద్దుటూరు: మండలంలోని నంగనూరుపల్లెలో పేదల ఇళ్లను తొలగించవద్దని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కోరారు. మండల తహసీల్దార్ గంగయ్యను మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎప్పటినుంచో సర్వే నంబర్ నంబర్ 93లోని గ్రామకంఠం భూమిలో పేదలు ఇళ్లు వేసుకుని నివసిస్తున్నారని రాచమల్లు తెలిపారు. శ్మశానం కోసం ఈ స్థలాన్ని ఖాళీ చేయించాలని అధికారులు ప్రయత్నిస్తున్నారన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సంధ్య, గ్రామస్థుల పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలి

బద్వేలు అర్బన్: బద్వేల్ పట్టణంలో బీసీ భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బి.గురుమూర్తి కోరారు. జిల్లా బీసీ సంక్షేమాధికారిణిగా బాధ్యతలు చేపట్టిన అంజల, సూపరింటెండెంట్ నాగరత్నమ్మలను మంగళవారం ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ బీసీ సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, ఎర్రగుంట్ల, కానగూడూరు, చింతకొమ్మదిన్నె బాలుర వసతి గృహాలను పున:ప్రారంభించాలని కోరారు. రాజ, శ్రీనివాసులు, సుభాన్‌బీ, రమణ పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ తీగలు తగిలి వ్యక్తి మృతి

రాజుపాళెం: మండలంలోని గాదెగూడూరులో ప్రమాదవశాత్తూ విద్యుత్ లైన్ తీగలు తగిలి ముల్లా ఖాజా (45) అనే వ్యక్తి మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. రాజుపాళెం ఎస్ఐ వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా మండల కేంద్రమైన చాగలమర్రికి చెందిన ముల్లా ఖాజా రాజుపాళెం మండలంలోని గాదెగూడూరులో ఓ ఇంటి నిర్మాణానికి సంబంధించి సిమెంటు పూతలు వేసేందుకు వచ్చాడన్నారు. గోడకు సిమెంటు పూత వేసే క్రమంలో సార్వ కట్టుకునేందుకు గోడకు రంధ్రం వేస్తుండగా పైన ఉన్న విద్యుత్ లైన్ తీగెలు తగిలి షాక్ గురయ్యాడు. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మృతి చెందిన ముల్లా ఖాజా

సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థినుల ప్రతిభ

ప్రొద్దుటూరు కల్చరల్: మండలంలోని గౌతమి మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు నాల్గో సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపల్ వై.ప్రకాష్‌రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈసీఈలో వి.పూజ 99.7 శాతం, టి.మౌనిక 97.5 శాతం, వి.పుష్పలత 96.7 శాతం మార్కులు సాధించారన్నారు. సీఎంఈలో డి.హర్షిత 97.89, వి.షరోనిక 97.56, వి.శ్రావణి 97.33, ఈఈఈలో ఎం.దివ్య నయన 87.2, బి.నవ్యశ్రీ 78.5, కె.నవ్యశ్రీ 76.2 శాతం మార్కులు సాధించారని వివరించారు. కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూర్, రవీంద్రారెడ్డి, కోడైరెక్టర్ శైలూష, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.రామసుబ్బమ్మ, కోటేశ్వరరావు, యాకూబ్ ఆలీ, మహమ్మద్ జాబీర్, అధ్యాపకులు అభినందించారు.



డి.హర్షిత



వి.షరోనిక



వి.శ్రావణి

ఆగస్టు 23న ఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్లీనరీ సమావేశం

ప్రొద్దుటూరు: ఆగస్టు 23, 24 తేదీలలో కడపలో రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను నిర్వహిస్తున్నామని ఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు యాదవ్ తెలిపారు. ఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్లీనరీ సమావేశాల కరపత్రాలను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలను పాటించకుండా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో డొనేషన్లు, అడ్మిషన్ ఫీజులు, పుస్తకాలకు డబ్బు వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలల్లో ఖాళీ పోస్టులను భర్తీచేయాలని కోరారు. సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్లీనరీ సమావేశాల్లో భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.సుబ్బరాజు యాదవ్, దక్షైవు రామాంజనేయులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు


సమస్యలు పరిష్కరించిన స్నేహశీలి

బద్వేలు అర్బన్: సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా పనిచేసిన స్నేహశీలి డాక్టర్ మీనాక్షిరెడ్డి అని విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు జి.పుల్లంరాజు, కార్యదర్శి కె.బ్రహ్మయ్య పేర్కొన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మీనాక్షిరెడ్డి సంతాపసభ మంగళవారం స్థానిక అసోసియేషన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యునిగా, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టడంతో పాటు విశ్రాంత ఉద్యోగుల సంఘం భవన నిర్మాణానికి ఎంతో కృషి చేసారన్నారు. తొలుత మీనాక్షిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, గంగన్న, పిచ్చయ్య, రాణి, ఆనందరావు, రాఘవరెడ్డి, లక్ష్మీరెడ్డి, మహబూబ్‌సాహెబ్, గ్రేసియస్, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న పుల్లంరాజు

ఆయిల్‌పామ్ సాగుచేస్తే అధిక లాభాలు



రైతులతో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు



వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ సురేష్‌రెడ్డి

కాశినాయన: రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చునని ఉద్యాన అధికారి శ్రీనివాసులురెడ్డి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండ్రాజుపల్లె గ్రామంలో రైతులు సాగు చేసిన ఉద్యాన పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు మొక్కలు ఉచితంగా ఇవ్వడంతోపాటు, నాలుగేళ్లపాటు సాగుకు అయ్యే ఖర్చు రూ.21వేలు రాయితీ రూపంలో అందిస్తామన్నారు. స్వల్పకాలిక పంటలైన కూరగాయలు, పప్పు ధాన్యం పంటలను అంతర పంటలుగా సాగు చేస్తే ఏడాదికి రూ.5,200 చొప్పున నాలుగేళ్లకు రూ.21 వేలు ప్రభుత్వం రాయితీ ఇస్తోందని తెలిపారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు, ఫారంపాండ్స్ నిర్మిస్తే మరో రూ.70 వేలు అదనంగా రాయితీ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల ఏడీఏ మురళీధర్‌రెడ్డి, ఏవో చంద్రమోహన్, ఏఈఓలు రవి, మహేష్ పాల్గొన్నారు.

అట్లూరు: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. మండలంలోని బయనపల్లె గ్రామంలో రెండు రోజుల పాటు కేవీకే నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తన పొలంలో ప్రకృతి వ్యవసాయం చేసే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వి.శిల్పకళ, డాక్టర్ కె.సాయి మహేశ్వరి, డాక్టర్ ఎస్.మానస, డాక్టర్ పి.మహేష్‌బాబు, అరుణ పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: మండలంలోని గానుగపెంటలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ చంద్రమోహన్‌రెడ్డి పత్తి పంటలను పరిశీలించారు. చీడ పీడల నుండి పంటను కాపాడుకునేందుకు అవసరమైన సూచనలు చేశారు. గ్రామసభలో పథకాలపై అవగాహన కల్పించారు.

చాపాడు: పీఎం కిసాన్ పెట్టుబడి సాయం కోసం అర్హులైన రైతులు వెంటనే బ్యాంక్ లింకేజ్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి దేవి పద్మలత సూచించారు. మండలంలోని అల్లాడుపల్లె, శ్రీరాములపేట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. పచ్చిరొట్ట ఎరువుల కోసం జీలుగ, జనుము వచ్చే వారంలో పంపిణీ చేస్తామని తెలిపారు.

బి.కోడూరు: వరిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి కౌశిక తెలిపారు. మంగళవారం మండలంలోని ప్రభలవీడు, మేకవారిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వరిలో ఎరువుల వాడకం, సస్యరక్షణ, యాజమాన్య పద్ధతుల గురించి వివరించడం జరిగింది.

మైదుకూరు: వరి పంట సాగులో కాలిబాటలకు ప్రాధాన్యం ఇవ్వాలని మైదుకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు కృష్ణమూర్తి అన్నారు. మైదుకూరు పరిధిలోని లింగాలదిన్నె, గడ్డమాయపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ కృష్ణమూర్తి మాట్లాడుతూ వరిలో తెగుళ్ల పురుగు మందుల వినియోగం గురించి సవివరంగా తెలిపారు. ఏఓ బాలగంగాధర్ రెడ్డి, డాక్టర్ ఎం.బాలకృష్ణ, ఫిరోజ్ హుస్సేన్, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు రూరల్ :పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సురేష్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నంగనూరుపల్లె గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. నంగనూరుపల్లె గ్రామంలో రైతులు సాగు చేసిన వరి పంటను ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. బాలాజీ రైతు మిత్ర సంఘానికి 80 సబ్సిడీతో మంజూరైన డ్రోన్‌ను పంపిణీ చేశారు. సబ్సిడీ పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో వరహరికుమార్, భరత్, రైతులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రొద్దుటూరు: ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పది గంటల పని విధానం అమలుచేయడం దుర్మార్గమన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికుల వేతనాలను జీఓ–36 ప్రకారం రూ.24,500 ఇవ్వాలన్నారు. ఆప్కాస్ కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని, 17 రోజుల సమ్మెకాల ఒప్పందాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూలై 9న సమ్మెకు పిలుపునిస్తున్నట్లు ఆయన తెలిపారు. గంగాధర్‌రెడ్డి, వెంకటేష్, బాలాజీ, భాస్కర్, ప్రమీలమ్మ, ఓబుళమ్మ, శివప్రసాద్, చంటి, శ్రీనివాసులు పాల్గొన్నారు.